జీవిత దృశ్యాలు

శివరావు ముసలివాడైనాడు.

అని ఎవరు చెప్పారు ?

గవర్నమెంటు చెప్పింది. మూడునెలల నుంచీ మంచం చెపుతున్నది. జబ్బు చెప్పింది.

శివరావుకి పెత్తనం వచ్చేసింది. 'ఇక బ్రతకటం కూడా అనవసరమే—' అని ఇంట్లోవాళ్ళు కొంతమంది అభిప్రాయ పడుతున్నట్లుగా శివరావుకీ తెలిసింది. శివరావు యేమీ అనుకోలేదు. 'చూశావా' అనీ అనుకోలేదు. నిర్లిప్తుగా వుండిపోయినాడు.

ఒక ఉదయం.

శివరావుకి నీరసం మరీ యెక్కువైంది.

అమ్మవొడిలోంచి తప్పించుకుని అందకుండా పరిగెత్తిన అల్లరిపిల్లవాడిలా తూర్పు దిక్కు వొడినుండి సూర్యుడు చాలాపైకి వచ్చాడు, ఎనిమిది గంటలు కావచ్చును.

డాక్టరు వచ్చాడు.

శివరావుని చూశాడు.

డాక్టరు ముఖంలో శివరావు చూశాడు. తనకోసం కొత్తలోకపు తలుపు లెవరో తెరుస్తున్నారు. ఆ తలుపులు తెరిచే ద్వార పాలకులు మంచివాళ్లకు మంచివాళ్ళగా, చెడ్డవాళ్లకు చెడ్డవాళ్లుగా కన్పిస్తారుట. శివరావు చూశాడు. శివరావుకి భయం వెయ్యలేదు.

డాక్టరు వెళ్ళిపొయ్యాడు. శివరావుకెందుకో దిగులైంది.

ఎందుకు ? కొత్తలోకపు తలుపు లెవరో తెరుస్తున్నారు.

డాక్టరు ఇంట్లోవాళ్లకు యేంచెప్పాడో ? అంతా కళ్లల్లో దయపెట్టుకుని చూసిపోతున్నారు.

ముసలాడికి దిగులైంది. నవ్వొచ్చింది.

కొడుకు వచ్చాడు. "నాన్నా కాఫీ త్రాగుతేవా ?"

కొడుకు మూడేళ్ళ పిల్లవాడిలా పిలిచాడు. ఈ మధ్య వాడెప్పుడూ అలా పిలవలేదు. శివరావుకి సంతోషమైంది.

కోడలు వచ్చింది. "మామయ్యా ఇంద, ఫియా కాకొస్త పుచ్చుకోండి,"

ఎన్నాళ్ళైంది, ఇంత ఆత్మీయత కనపరచి!

ఎందుకు వీళ్ళందరికీ ఇంతదయ ?

తనకోసం కొత్తలోకపు తలుపులు తెరుస్తున్నారు.

అందుకే. వీళ్ల కళ్ళు చెమరిస్తున్నాయి.

ఇది వీడ్కోలు కాబోలును.

అందుకా యింత ఆర్ద్రత ! అవును మరి. వీడ్కోలు దృశ్యంలో కపటాలు, కార్పణ్యాలు, కోపాలూ తాపాలూ, అన్నీ వదిలేసుకుంటారు. అందరు మనుష్యులూ అంతే.

ముసలాడికి నవ్వొచ్చింది.

కొడుకు ఆఫీసునుంచి ముందుగా వచ్చాడు.

కోడలు పదిసార్లు వచ్చి తొంగిచూసి పోయింది. మూడుసార్లు జ్వరం చూసింది. నాలుగుసార్లు దుప్పటి కప్పింది. రెండు సార్లు మందిచ్చింది. ఒకసారి పలకరించింది. కొడుకొచ్చి పక్కనే కూచున్నాడు.

ముసలాడికి కళ్లలో ప్రాణం వచ్చింది.

మూడురోజు లిలాగే జరిగింది.

ముసలాడు కోలుకున్నాడు. కొత్తలోకపు తలుపు లిప్పుడప్పుడే తెరువట. బ్రతకాలనిపిస్తోంది.

"మంజుశ్రీ"

నాలుగోరోజు డాక్టరు చెప్పాడు కొడుకుతో.

"తమాషాగా వుందండీ. కోలుకుంటాడని అనుకోలేదు. ఇప్పుడప్పుడే యేంఫరవాలేదు"

ముసలాడు విన్నాడు. నిర్లిప్తతతో వూరుకున్నాడు.

మర్రోజునుంచీ మళ్లీ మొదలు.

అతడు బ్రతకటం అనవసరం. పెద్దతనం వచ్చేసింది.

పక్కలో యెవరూవచ్చి కూర్చోరు. దుప్పటి యెవ్వరూ కప్పరు.

శివరావుకి చిత్రమైంది.

శివరావు యెందుకు బ్రతికాడు ?

వాళ్లు తనమీద అంత ప్రేమ చూపుతుంటే డాక్టరు అలా చెప్పినప్పటినుంచి కళ్ల నీళ్లు పెట్టుకుంటుంటే, వీళ్లకు తాను కావాలని, గుండెలకి హాయికలిగి, బలంవచ్చి, మనసుకి బతకాలని వాంఛకలిగి బతికాడు.

కాని శివరావుకి మర్రోజే తెలిసింది. తాను తప్పుగా అర్థంచేసుకున్నాడని. వీళ్లకు తన మీద ప్రేమలేదు. పాపం చచ్చిపోతాడు గదా అని జాలిపడ్డారు. తాను తెలుసుకోలేదు.

మళ్లీ డాక్టరు వచ్చాడు.

"మళ్లీ దిగజారిపోయాడేమిటండీ" అన్నాడు కొడుకుతో.

కొడుకు మాటాడలేదు.

కోడలు మాటాడలేదు.

ముసలాడు విస్తుపోలేదు.

'జాగ్రత్త' అన్నాడు డాక్టరు.

అని వెళిపొయ్యాడు.

శివరావు ఆలోచించాడు.

ఏమిటీ జీవితం ? అని.

ఏమిటీమనుషులు ? అని.

ఎందుకు బ్రతుకుతున్నాం. బ్రతికి యేం సాధిస్తున్నాం, అని.

చచ్చిపోతాం. చచ్చిపోయిన తర్వాత యేమిటని ?

కథ మొదలు. అనగాఅనగా వోఊళ్లో వోఅయ్యా, అమ్మావున్నారు. వాళ్ళకో అబ్బాయి పుట్టాడు.

ఆ అబ్బాయి వాళ్లమ్మ కాళ్ల మీద వేసుకుని నీళ్లుపోస్తుంటే యేడ్చాడు. సాంబ్రాణి ధూపం వేసుకున్నాడు. కళ్లకు కాటుక పెట్టుకున్నాడు. నుదుట చాదుచుక్క పెట్టుకున్నాడు. ఉయ్యాల్లో నిద్రపోయాడు. బోర్లపడ్డాడు. బోసినవ్వులు నవ్వాడు. అందరినీ నవ్వించాడు. ముద్దులు పెట్టించుకున్నాడు. గోరుముద్దులు అన్నాడు. కూచున్నాడు. నిలుచున్నాడు. తప్పటడుగులు వేశాడు.

బడికిపోయినాడు. బలపాలు విరుచుకున్నాడు. పలకలు పగులకొట్టుకున్నాడు. అ, ఆ లు దిద్దుకొన్నాడు. దెబ్బలు తగిలితే వీపురుద్దుకున్నాడు. గుణితం నేర్చుకున్నాడు. గోడకుర్చీలు వేశాడు. వాచకాలు చదివాడు. పద్యాలు కంఠస్థంచేశాడు. కూడికలూ, తీసివేతలు, హెచ్చవేతలు, భాగాహారాలు, ఇరవైయెక్కాలూ నేర్చుకున్నాడు. ఇంకొస్త పెద్దవాడైనాడు. గోలీకాయలాడాడు. బిళ్లాకోడూ ఆడాడు. ఇంకొస్త పెద్దవాడైనాడు. రహస్యంగా బీడీలు కాల్చాడు.

ఇంకా, ఇంకా...ఒక్కొక్కక్లాసేచదివి పెద్దచదువుకొచ్చాడు.

నలగని, మడతలు చెరగనిబట్టలు కట్టుకోవటం నేర్చుకున్నాడు. జుట్టు చెదరకూడదు. రహస్యంగా అమ్మాయిల వేపు దొంగ చూపులు చూడటం నేర్చుకున్నాడు. వినపడీ వినపడకుండా కూనిరాగాలుతీశాడు.

ఇంకా ఇంకా, మంచి మంచికథలు చదవటం నేర్చుకున్నాడు.

అందాన్ని అరాధించటం నేర్చుకున్నాడు.

ఏమిటో అసంతృప్తి, ఏమిటో మొతి ఏమిటో అశాంతి.

కలలు కంటాడు పువ్వులని ప్రేమిస్తాడు.

కలలు, కలలు, కలలు.

అందమైన అమ్మాయిలు సినిమాలు, పార్కులు, పత్రికలు.

జీవితం పైన ఆదరం భవిష్యత్తుపైన ఆశ, గతాన్ని తలుచుకోని గర్వం, వర్తమానం అంటే భయం లేకపోవటం, ఇదీ యవ్వనం.

పెద్ద చదువులు చదివాడు. ఏదో ఉద్యోగమూ వచ్చింది.

జీవితంలో రెండోదశ.

పెండ్లి కూడా అయింది.

కలలో పండించుకున్న ఆశలను రానిపోసుకున్నాడు.

చిటికెనవేలు యిచ్చి హోమగుండం చుట్టూ ప్రదక్షిణాలు చేయించాడు.

ఒకరు ఇద్దరయినాడు. మధుపర్కాలు ముడివేసుకున్నారు.

తలంబ్రాలు పోసుకున్నారు. "మమజీవన హేతునా..." అన్నాడు. బొట్టుపెట్టాడు. గంధం పూశాడు. బొట్టు పెట్టించుకున్నాడు. గంధం పూయించుకున్నాడు.

కన్నుల్లో కన్నులుంచి బ్రతుకులోని తీయందనాన్ని అనుభవించాడు. ప్రియురాలి కన్నుల్లో జీవితానికి వ్యాఖ్యానంచదువుకున్నాడు. ఆమె చిరునవ్వును వెన్నెలనుకున్నాడు.

ఆమెకండ్లు మన్మథుని విండ్లు అనుకున్నాడు. ఆమె దేవత అనుకున్నాడు. తాను దేవుడైనాడు.

"అవిదిత గతయామా......"

ఇంకా ఇంకా......పిల్లల్నికన్నాడు.

ఆమెనే అప్పుడప్పుడూ చీదరించుకోవటం నేర్చుకున్నాడు. కలలు కరిగిపోయినవి, కళ్లలో కాంతి తగ్గింది.

పిల్లలు పెద్దవాళ్లవుతుంటే చూసి ఆనందించటం నేర్చుకున్నాడు: తనప్రేమను పంచుకున్నాడు.

ఎన్నెన్నో ఊళ్ళు చూశాడు.

ఎంతెంతమందినో మనుష్యులని చూశాడు.

బ్రతుకులోని ఇదివరలో అనుభవించిన తీపిని నెమరువేసుకుంటం నేర్చుకున్నాడు. అప్పుడప్పుడు ఉస్సురని నిట్టూర్చేవాడు, బాధ్యతలూ, బరువులూ, బాధలూ, గడచిపోయినగాథలూ...

"నా తోటి రాయె యెంకి"

చిత్రకారుడు: కొర్లపాటి వెంకటసత్యనారాయణమూర్తి—వాల్తేరు.

ఎన్నెన్ని రకాల మనుష్యుల్ని చూశాడు

ఎన్నిటికి బాధపడాడు?

ఎన్నిటికి సంతోషించాడు?

ఎన్నికష్టాలు వచ్చినై, ఎన్ని కన్నీళ్ళు కారినై.

తనచుట్టూ ప్రపంచాన్ని చూసి అప్పుడప్పుడు దడుసుకున్నాడు. ఎందుకు? చిత్రమైనదీ ప్రపంచం.

దేవతార్చన చేస్తూనే గోడ్డుమాంసం అనే మనుష్యులున్నారిక్కడ. చిరునవ్వులు వెలారిస్తూనే చిచ్చుపెట్టగలవాళ్ళున్నారిక్కడ. నోటితో మాటాడుతూ నొసలుతో వెక్కిరించగలరు మనుష్యులు. ఆత్మలులేని శరీరాలు యెన్నో వున్నాయి. నీతిని గురించి ఉపన్యాసాలు చెపుతూ అవినీతిపనులు యెన్నైనా చేయగలరు. వంచన, దగా, మోసం, జీవితానికి ముఖ్యమైనాయి.

అతనూ చేశాడు యెన్నో పాడుపనులు.

అబద్ధాలు చెప్పాడు. నీచులను పొగిడాడు. పనులు చేయించుకున్నాడు.

కొడుకులకు చదువులు చెప్పించాడు.

కూతుళ్లకు పెళ్లిళ్లుచేశాడు,

కొడుకులకు పెళ్లిళ్లుచేశాడు.

కూతుళ్లను పురుళ్లకు తెచ్చాడు.

కొడుకులకూ, కూతుళ్లకూ కొడుకులూ, కూతుళ్లూ పుడుతుంటే బారసాలలు చేయించాడు. వ్రతాలు చేయించాడు.

బారసాల పీటలమీద మంచిబట్టలు పెట్టలేదని అల్లుడలిగితే తాను అలిగిన రోజులు గుర్తుతెచ్చుకున్నాడు.

వానవస్తే యెన్నెన్నో అనుభూతులు త్రవ్వుకునేవాడు.

ఆమె యెక్కడుందో చూసేవాడు.

వానలో తడిస్తే ఇంటికి వచ్చినప్పుడు ఆమె కళ్ళలో యెంత ఆత్రుత? నీళ్లు వస్తాయేమోనని తల ప్రక్కకి త్రిప్పకోవటం గురుకి తెచ్చుకునేవాడు. రహస్యంగా కాఫీలు అందించటాలు, తాంబూల చర్వణాలు...జీవితం మారిపోతుందిసుమా అనుకునేవాడు.

ఎక్కడినుంచో భగవద్గీత కొనుక్కొచ్చుకున్నాడు.

ఈమధ్యనే రామకోటి వ్రాయటం మొదలెట్టాడు.

పర్వదినాల్లో ఉపవాసాలుంటున్నాడు, అప్పుడప్పుడూ దేవాలయానికి పోతున్నాడు. "గోవిందంభజ మూఢమతే..." అంటున్నాడు అప్పుడప్పుడూ.

(45-వ పేజీ చూడండి)

★ సీతాస్వయంవరం ★

(23-వ పేజీ తరువాయి)

హైదరాబాద్,

సీతా,

నీగుండె, ఇంత పిరికిగుండె అనుకోలేదు, నేనెప్పుడూ ఇంతవరకు నిన్ను గురించి, నేను, గొప్ప గుండెనిబ్బరంగలదానివనుకుంటుండేదాన్ని సుమా! అదంతా నా అపోహేనా. ఒక విషయంమాత్రం గుర్తుంచుకో. మనం జీవితంలో అనేకమైన అనుకోని పరిస్థితులను, ఎదుర్కోవలసివస్తుంది. అంతమాత్రాన బేజారైపోతే ఎలా?

కానీ, సీతా! నేనుమాత్రం నీ మనస్సు అర్థంచేసుకోవడం లేదనుకోకుసుమా! ఏదిఏమైనా, నీవొక లక్షాధికారిబిడ్డవు. కట్నాలు ఇచ్చుకోలేక తంటాలుపడే సామాన్య కుటుంబంలో నీవు జన్మించలేదు. నీవు అంతవరకు, అదృష్టవంతురాలవేగదా. ఒక్కసారి, నా పెళ్ళికై మానాన్న పడ్డపాట్లు ఊహాపథంలోకి తెచ్చుకో.

తాంబూలాలుపుచ్చుకొన్నతర్వాత పెళ్ళి వెనక్కిపోయిందన్నావు, అతను అంత మూర్ఖుడా! తాంబూలాలు పుచ్చుకోడమంటే అర్థంతెలియని జ్ఞానహీనుడా! పుట్టుమచ్చల ఆధారంగా, జీవితంలోని మలుపులను గుర్తింపగలిగిన మేధాసంపన్నుడా. క్షమించు, అతన్ని నిందిస్తే నీకు కోపం వచ్చిందేమో!

మనం స్కూలు విడిచేటప్పుడు 'కాండక్టు సర్టిఫికెట్'లు ఇస్తారు జ్ఞాపకంఉందా! దానిపై గనుక అసంతృప్తికరమైన రిమార్కు ఉంటే ఉద్యోగాన్వేషులకు ఎంతకష్టమో. ఊహించు. తాంబూలాలు పుచ్చుకొన్న తర్వాత పెళ్ళి వెనక్కుపోతే, పెళ్ళికావలసిన ఆడపిల్లల పరిస్థితికూడా అంతే!... ఏమైనా అధైర్యపడి, మనస్సు పాడైపోవటంకంటే, వేరేప్రయోజనమేమీలేదు.

అయినా, బహుశా ఈ ఉత్తరం అందేటప్పటికి, మరోసంబంధం వస్తుందేమో. మీనాన్న గట్టిగా ప్రయత్నిస్తున్నాడన్నావుగా!

చెప్పినవన్నీ మనస్సులో పెట్టుకో. మనస్సు కలతచేసుకోకు.

శారద

* * *

గుంటూరు,

శారదా,

నీవు వ్రాసిన ఉత్తరంతోపాటు మరో ఉత్తరంకూడా వచ్చింది, గూడూరునుంచి. మొన్న, అంటే కిందటివారంలో, మానాన్న గూడూరువెళ్ళి విచారించి వచ్చిన సంబంధం గురించి. ఆ అబ్బాయిపేరుసంపత్ కుమార్ట. పేరులాగానే, అబ్బాయికూడా బాగానే ఉన్నాడు ఫోటోలో. వాళ్ళ నాన్నకు, గూడూరులో పెద్దమెకాగని ఉందిట. మర్నాడే దిగారు, మా ఊళ్ళో. మానాన్న మా ఇంట్లోనే వసతిఏర్పాటు చేస్తానంటే ఆ అబ్బాయితండ్రి అన్నాడుట—సంబంధం చూడబోతూ, మా యింట్లో వసతిఏర్పాటు చేసుకోవటం, వాళ్ల ఆచారానికి విరుద్ధమని. అందుకే నాన్న, వారికి దగ్గరగా ఉన్న సత్రంలో, మంచివసతి ఏర్పాటుచేశారు. మర్నాడు మా యింటికి వస్తామన్నారుట, నన్ను చూడటానికి! కానీ, మర్నాటి ఉదయాన్నే వారు మకాం ఎత్తేశారుట. కారణమేమిటా అని మా నాన్న సత్రం గుమాస్తాతో విచారించాడుట. అతను నీళ్లునములుతూ చెప్పాశుట—నా ప్రవర్తన మంచిది కాకపోబట్టే, ఇదివరలో తాంబూలాలు తీసుకొన్నవారు వెనక్కుపోయారనీ; ఏదో బలమైన కారణం లేకపోతే, ఈ విపరీతం జరగటానికి అవకాశం లేదనీ; అందుకే వారు మాతో చెప్పకుండా వెళ్ళిపోయారుట.— ఈ మాటలు నాన్న అర్థరాత్రివేళ అమ్మతో రహస్యంగా అంటుంటే, నిద్రపట్టక కొట్టుకుంటున్న నాకు వినపడ్డాయి. గుండెల్లో పిడుగులు పడ్డట్టయిందనుకో!

శారదా! నా మనస్సు ఆశ నిరాశలలో ఊగులాడి, ఊగులాడి; అనేక ఎదురుదెబ్బలు తిని మొద్దుబారిపోయింది. నీవు బోధించినట్లుగానే, పరిస్థితుల ప్రభావాన్ని దిగమింగి, అనుకూలపరిస్థితుల్ని సృష్టించుకోదల్చుకున్నా.

చలపతిమేష్టారు తెల్సుకదూ! ఏమో, నీకు జ్ఞాపకం ఉందో లేదో; మనిద్దరం కలసి చదువుకునే రోజుల్లో ట్యూషన్ చెప్పించుకున్నాం: అప్పట్లో ఆయన ఇంటరు చదువుతూండేవారు. జ్ఞాపకం వచ్చిందా! ఆయన ఇప్పుడు బి. కాం. పూర్తిచేశారు; ప్రస్తుతం నిరుద్యోగి. ఆయనకు మనగురించి వాస్తవ విషయాలన్ని తెల్సుగదా! (నీవు అత్తగారింటికి వెళ్లిన తర్వాత, నీ గురించి ఆయనకేమి తెల్సు లే) నా కుడిమోచేతి మీదనున్న పుట్టుమచ్చవల్ల వచ్చే ప్రమాదాలన్నీ ఎదుర్కోడానికి సిద్ధమేనట.

బహుశా ఈ ఉత్తరం నీకందేటప్పటికి, నేనూ, చలపతి గారు, మేరేజి రిజిష్ట్రారువారి రికార్డులలో దంపతులముగా నమోదు చేయబడి ఉంటాము.

అమ్మ, నాన్నలను తర్వాత ఒప్పింపజేస్తాలే; వారిభారం తీరిపోతుంది. శాస్త్రోక్తంగా జరిగే మా వివాహానికి నువ్వు తప్పకుండా కుటుంబసమేతంగా ముందుగానే రావాలి సుమా. నీ చేతులమీదుగానే, పెళ్లికూతుర్ని కావాలని ఉంది—

నీ బాబు బాగున్నాడా!

సీత— ★

జీవితదృశ్యాలు

(21-వ పేజీ తరువాయి)

ఏమీ తోచనప్పుడు గజేంద్రమోక్షం చదువుకుంటాడు.

లేకపోతే పిల్లల్ని విసుక్కుంటాడు. కాకపోతే ఆమెను కసురుకుంటాడు.

ఏమిటో తెలిసికోవాలన్న బలవత్తరమైన కోరిక.

ఏమిటీ తెలియటంలేదు.

ఇంత చంచలమైనదాన్ని చూసుకునేనా తాను ఇంత మోహాన్ని పెంచుకున్నాడు. ఇంతగా సంతోషించాడు.

ఏమున్నది ఇక్కడ?

సుఖాన్ని తూచేందుకు తక్కెడ!?

సుఖంలేదు. దుఃఖంలేదు. దేవుణ్ని రుడీ అంటదు.

ఇది వేదాంతం.

మనుష్యుడికి అన్నీ తెలుసు.

మనుష్యుడికి యేమీ తెలియదు.

మనుష్యుడి అంతర్యం మంచిదే.

కాని పాడుపనులు చేస్తాడు.

వద్దనుకుంటూనే పాడుపనులు చేస్తాడు.

కావాలని చేసేవాళ్లుకూడా లేకపోలేదు.

ఏం చూసుకుని ఇంత గర్వం?

దేన్ని చూసుకుని యీ మోహం?

ఇది జీవితం.

లేనిది, ఏమీలేదు.

జీవితానికి సత్యమైనది మృత్యువొక్కటే.

"వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ."

అన్నాడు గీతాకారుడు.

Words move, music moves only in time; but that which is only living can only die..........

అన్నాడు టి. ఎస్. ఇలియట్.

శివరావు ఇలా అనుకున్నాడు:

ఇవాళో రేపో యెల్లుండో ఎప్పుడో నేనూ చచ్చిపోతాను.

తరువాత ఏమిటి?

దీనికి సమాధానం.

భగవద్గీత.

వేస్ట్ లాండ్.

చివరకు మిగిలేది.... ★